అనాథీనం భూమిపై పచ్చడేగల కన్ను

- చంద్రగిరిలో కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం
- కళ్ల ముందే ప్రభుత్వ భూమి మాయం!
- దరఖాస్తు పట్టా ఉందంటూ బుకాయింపు
- తప్పుడు రికార్డులతో రెవెన్యూ అధికారుల సహకారం..?
- అధికార పార్టీలోని ఓ నాయకుడికి తెలిసే జరుగుతోందని ప్రచారం



చంద్రగిరి ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ప్రభుత్వ భూమిని చదును చేసిన దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత నగరు శివారు ప్రాంతాలతో పాటు తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాల్లోని భూములకు విలువ భారీగా పెరిగింది. శివారు ప్రాంత భూములకు డిమాండ్ వచ్చింది. ఇది కూటమిలోని పచ్చనేతలకు కలిసొచ్చింది. ప్రభుత్వ భూములుగా పిలిచే అనాధీనం, పోరంబోకు భూములు కనిపిస్తే చాలు గద్దల్లా వాలిపోతున్నారు. తాజాగా చంద్రగిరికి చెందిన ఓ అధికార పార్టీ నేత పేదల అవసరాల కోసం కేటాయించిన అనాధీనం (ప్రభుత్వ భూమి)ను దర్జాగా కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడు. కోట్లాది విలువ చేసే ప్రభుత్వ భూమిని రక్షించాల్సిన రెవెన్యూ అధికారులు దీనికిగాను సహకరించారని, ఆ భూమికి సరికొత్త రికార్డును సైతం తయారు చేసి ఇచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. 2005 నుంచి కాపాడుకుంటూ వచ్చిన ఆ భూమికి రెవెన్యూలోని కొంత మంది అధికారులు ఇలా ఆక్రమణకు సహకరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇదంతా అధికార పార్టీకు చెందిన ఓ నేతకు తెలిసే జరుగుతోందంటూ విమర్శలు కూడా లేకపోలేదు.

రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా

చంద్రగిరి ఇందిరమ్మ కాలనీ సమీపంలోని చంద్రగిరి గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 1513/8లోని 47సెంట్ల భూమిని కాలనీ ప్రజల సౌకర్యార్థం పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్ వాడీ భవనాల నిర్మాణానికి కేటాయించారు. ఆ భూమికి దరఖాస్తు పట్టా కేటాయించి ఉండడంతో దానిని అప్పటి రెవెన్యూ అధికారులు రద్దు చేసి అనాధీనంగా రెవెన్యూ రికార్డుల్లో మార్చారు. ఆ భూమికి భారీగా విలువ పెరగడంతో దానిపై చంద్రగిరికి చెందిన టీడీపీ నేతలు కన్నేశారు. ఎలాగైనా ఆ భూమిని కొట్టేయాలని వ్యూహం పన్నారు. గతంలో దరఖాస్తు పట్టా పొందిన వారిని తెర మీదకు తెచ్చారు. గతంలో ప్రభుత్వం తమకు కేటాయించిన దరఖాస్తు పట్టా భూమిని యధావిధిగా అప్పగించాలని అర్జీలు పెట్టించారని, ఆ అర్జీలను ఆధారంగా చేసుకుని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి సహకారంతో రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చారనే ప్రచారంలోకి వచ్చింది. దీనికి తగ్గట్టు అనాధీనంగా ఉన్న భూమిని తిరిగి దరఖాస్తు పట్టాగా మార్పులు చేసి కొత్త రికార్డును తయారు చేశారనే వాదనకు బలం చేకూరుతోంది. గతంలో అనాధీనంగా మార్పు చేసిన సర్వే నంబరు 1513/8ను అలాగే విడిచిపెట్టి ఆ స్థానంలో 1513/8ఎ అన్న సరికొత్త సర్వే నంబరుతో 47 సెంట్ల భూమిని కె. విజయలక్ష్మి చెందిన దరఖాస్తు పట్టాగా ఆన్‌లైన్ అడంగల్, 1బి లను సిద్ధం చేసినట్లు భోగట్టా. దరఖాస్తు పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయడానికి 1859 నంబరుతో ఖాతాను కూడా తెరిచినట్లు సమాచారం.

22ఏ నుంచి తొలగించాలని..!

ప్రస్తుతమున్న రికార్డులు చేతబట్టుకున్న టీడీపీ నేతలు ఆ భూమిలోకి ప్రవేశించి చకచకా చదును పనులు పూర్తి చేశారు. అంతేకాక 22ఎ (రిజిస్ట్రేషన్ల నిషేధిత జాబితా) నుంచి ఆ సర్వే నంబరును తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసినట్టు సమాచారం. అదే జరిగితే కోట్ల రూపాయల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులే కబ్జా దారుకు అప్పగించినట్లవుతుంది. గత 20 ఏళ్ల నుంచి ప్రభుత్వ భూమిగా బోర్డు కనిపించిన ఆ భూమిలో హఠాత్తుగా అధికార పార్టీ నేతల ఆధీనంలోకి తీసుకుని చదును చేయడం స్థానికంగా దుమారం రేపుతోంది. పేదల అవసరాలకు కేటాయించిన ప్రభుత్వ భూమిని అడ్డగోలుగా అధికార పార్టీ నేతలకు అప్పగించించడంలో సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించి రికార్డులు తారుమారు చేసిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ప్రత్యక్ష ఆందోళనలకు పూనుకుంటామని ప్రతిపక్ష పార్టీల నేతలు, ప్రజా సంఘాలు, దళిత సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

లీగల్ నోటీసులు పంపిస్తున్నా

చంద్రగిరి ఇందిరమ్మ కాలనీ వద్ద ప్రభుత్వ భూమిని చదును చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో పనులను పూర్తిగా అడ్డుకున్నాం. వెంటనే ఆ భూమికి సంబంధించిన రికార్డులను తీసుకురావాలని ఆదేశించాం. గతంలో ఆ భూమిపై సర్వే నంబరు 1513/8ఏగా మార్చినట్లు రికార్డుల్లో గుర్తించాం. వాటిపై కూడా విచారణ చేస్తాం. అధికారుల వివరణ లేకుండా అసత్య ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సరికాదు. అలాంటి వారిని కూడా గుర్తించి, వారికి లీగల్ నోటీసులు ఇస్తాం. ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం నిరంతరం శ్రమిస్తుంది.

– శివరామసుబ్బయ్య, తహసీల్దార్, చంద్రగిరి

ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వం



కూటమి ఇచ్చిన హామీలను ప్లకార్డుల్లో ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి కల్చరల్: అధికారం కోసం అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకుండా కుంటి సాకులతో కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా వంచించిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్ విమర్శించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పార్టీ నేతలతో కలిసి కూటమి ప్రభుత్వం నమ్మించి దగా చేసిన హామీల ప్లకార్డులు ప్రదర్శించి మాట్లాడారు. ప్రజలకు ఇస్తామన్న అమ్మకు వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, రైతు భరోసా, నిరుద్యోగ భృతి హామీలు అమలు చేయకపోగా, రాష్ట్రంలో వృద్ధి రేటు సరిగా లేదని, ఆదాయం పెరిగితే హామీలు నెరవేర్చుతానని కాకమ్మ కథలు చెప్పడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే దానికి బాధ్యత వహిస్తానని గొప్పలు చెప్పిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు గోపాల్‌రెడ్డి, కిరణ్ రాయల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బోర్లు, మోటార్లకు మరమ్మతులు చేయండి



నగరంలో పనిచేయని బోర్లను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: నగర పరిధిలో తాగునీటి బోర్లు, మోటార్లకు మరమ్మతులు చేసి ప్రజలకు సమృద్ధిగా నీరివ్వాలని కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలో 48, 49 వార్డులైన జీవకోన, రాజీవ్ గాంధీ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, లెప్రసీ కాలనీ, కూరపాటి లేఔట్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్లు, ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి తనిఖీలు చేశారు. పలు చోట్ల నీరు రావడం లేదని, పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేయాలని ప్రజలు కోరడంతో ఆమె సైవిధంగా స్పందించారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో మురుగు కాలువల నిర్మాణానికి, మరమ్మతులకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి, ఏసీపీ బాలాజి, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



కబడ్డీ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న శేషారెడ్డి, ఆనందరెడ్డి

తిరుపతి రూరల్: క్రమశిక్షణతో కూడిన విద్య ప్రతి విద్యార్థికి అవసరమని బీఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి అన్నారు. ఎస్వీ సైన్స్, ఆర్ట్స్ డిగ్రీ కళాశాల, సహస్ర విజ్ఞాన్ జూనియర్ కళాశాలల మూడవ వార్షికోత్సవం బుధవారం బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా శేషారెడ్డి మాట్లాడారు. ఒక లక్ష్యం నిర్దేశించిన దాని సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యాసంస్థల కార్యదర్శి ఆనంద్ రెడ్డి ఎస్వీ సైన్స్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ధనుంజయులు రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఎస్ఎఫ్ఐ జిల్లా రెండ్రోజుల 5వ మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని 21 మందితో ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ తెలిపారు. జిల్లా కార్యదర్శిగా భగత్ రవి, అధ్యక్షుడిగా అక్బర్, జిల్లా ఉపాధ్యక్షులుగా అశోక్, వినోద్, తేజ, సహాయ కార్యదర్శులుగా ప్రవల్లిక, బాల, ఉమేష్, గురవయ్యతో కలిపి మొత్తం 21 మంది ఎంపిక చేసినట్లు చెప్పారు. విద్యా సమస్యలపై 10తీర్మానాలను ఆమోదించామని, ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో వేగం ముఖ్యం

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో చేస్తున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశించారు. నగరంలో చేస్తున్న అభివృద్ధి పనుల్లో పురోగతి, పారిశుద్ధ్యం, పన్నుల వసూళ్లు తదితర అంశాలపై బుధవారం వివిధ శాఖల అధిపతులతో కమిషనర్ సమీక్షించారు. అలాగే అన్ని సచివాలయ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్‌లో దిశా నిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగకరమైన పనులను గుర్తించి అనుమతులు మంజూరు చేశామని, ఆ పనులకు త్వరగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల పన్నులను సకాలంలో వసూలు చేసి నగరాభివృద్ధికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నగరంలో అనుమతులు లేని నిర్మాణాలను, నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా నిర్మాణాలు చేస్తున్నా ప్రణాళిక విభాగం అధికారులు అడ్డుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

పేకాటరాయుళ్ల అరెస్ట్

తిరుపతి క్రైమ్: నగరంలోని బ్యాంక్ ఎంప్లాయీస్ కాలనీలోని ఓ ఇంట పేకాట ఆడుతుండగా బుధవారం దాడులు చేసి ఏడుగురిని అరెస్ట్ చేసినట్టు అలిపిరి సీఐ రామకిషోర్ తెలిపారు. కాలనీలోని గోవర్ధన్ రెడ్డి ఇంటిపై దాడి చేసి తమ సిబ్బందితో దాడి చేసినట్లు ఆయన చెప్పారు. గోవర్ధన్‌రెడ్డితోపాటు మరో ఆరుగురుని అరెస్ట్ చేసి నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రోడ్డెక్కిన పారిశుద్ధ్య కార్మికులు

- మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నా చేశారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకులు బి.తులసేంద్ర, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడారు. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికుల వేతనాల్లో కోతలు పెట్టి, వేలాది రూపాయలు రికవరీ చేయడం ఎంతమాత్రమూ తగదని నిరసించారు. శానిటేషన్‌లో పనిచేస్తున్న డ్రైవర్లను అధికారుల వాహనాలకు ఉపయోగించుకోవడం వలన పారిశుద్ధ్య వాహనాలకు డ్రైవర్ల సమస్య తలెత్తిందన్నారు. 90 మంది కార్మికులను ఏడాది పాటు పని చేయించుకుని వారికి జీతాలు ఇవ్వకుండా 'ఆప్కాస్'కు లంకె పెట్టడం శోచనీయమని మండిపడ్డారు. పారిశుద్ధ్య కార్మికులకు ఎనిమిదేళ్లుగా గుర్తింపు కార్డులు సైతం ఇవ్వలేదని ఎండగట్టారు. పలు సమస్యలను ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్చించినా పరిష్కరించిన పాపానపోవడం లేదన్నారు. వచ్చే నెల 12వ తేదీ నుంచి నుంచి సమ్మెకు పూనుకుంటున్నట్టు ప్రకటించారు. ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు రాజా, రవి, ఆర్గనైజింగ్ కార్యదర్శి విశ్వనాథ్, ఉపాధ్యక్షులు దొరస్వామి, ప్రదీప్, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్, సహాయ కార్యదర్శులు ఉమాపతి, వంశీ, హరికృష్ణ, కోశాధికారి గుర్రప్ప, కార్మికులు పాల్గొన్నారు.

ఎస్వీయూ హాస్టల్ ఎన్ఎంఆర్‌ల ధర్నా



ధర్నా చేస్తున్న ఎన్ఎంఆర్‌లు, ఏఐటీయూసీ నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ హాస్టల్ ఎన్ఎంఆర్‌లను టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కే రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట హాస్టల్ ఎన్ఎంఆర్ ఉద్యోగులు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. దీనికి ఏఐటీయూసీ నేతృత్వం వహించింది. రాధాకృష్ణ మాట్లాడుతూ, ఎస్వీయూలో హాస్టల్ ఎన్ఎంఆర్ ఉద్యోగులు చాలీ చాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నా వారిని అధికారులు టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించడం లేదని విమర్శించారు. వర్సిటీలో ఉద్యోగులందరినీ సమానంగా చూడటం లేదని ఆరోపించారు. గురువారం వర్సిటీలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని, అలాగే మరో 10రోజులలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్టల్ ఎన్ఎంఆర్‌ల గౌరవాధ్యక్షుడు జిల్లా విశ్వనాధ్, ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు కేవై రాజా, ఎన్‌డి రవి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, సుధాకర్, లోకేష్, మణి, గౌతమి, హేమగిరి, వెంకటేశ్వర, విశ్వనాథం, రావుల సురేష్, ఎన్ఎంఆర్‌లు పాల్గొన్నారు.

పురంధర దాసుకు పుష్పాంజలి



పురంధర దాసు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రతినిధులు, భజన మండళ్ల సభ్యులు

తిరుపతి కల్చరల్: దాస సాహిత్య పితామహుడు పురంధరదాస ఆరాధన మహోత్సవాల్లో భాగంగా బుధవారం అలిపిరి వద్దనున్న ఆయన విగ్రహానికి టీటీడీ దాస సాహిత్య ప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అలాగే భజన మండళ్ల సభ్యులు పురంధర దాసు విగ్రహం వద్ద భజన కార్యక్రమాలతో అంజలి ఘటించారు. కార్యక్రమంలో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పీఆర్.ఆనందతీర్థాచార్యుడు, ఇతర అధికారులు, భక్తులు, భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

కర్ణపేయం.. దాసపదాల సంకీర్తనం

తిరుమల: తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాలు బుధవారం సాయంత్రం శ్రీ పురంధరదాసుల కీర్తనల భక్తి పారశ్యంతో పులకించాయి. బుధవారం శ్రీ పురంధరదాసు ఆరాధన మహోత్సవాల్లో రెండో రోజు శ్రీవారు ఉభయదేవేరులతో కలిసి నారాయణగిరి ఉద్యానవనాలకు వేంచేపు చేశారు. చల్లటి సాయంత్రం వేళ ఊంజల్‌సేవలో దాస సంకీర్తనల గానం భక్తులను మైమరపింపచేసింది. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసింది. టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ ఆనందతీర్థాచార్యులు, ఇతర అధికారులు, 3,500 మందికి పైగా ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకకు చెందిన భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

వేటూరికి నివాళి

సంగీత పద రచనల బాణీలతో సినీ పాటలకు ఓణీలు వేయించిన ప్రముఖ సినీ గేయ రచయిత వేటూరి సుందర రామ్మూర్తికి రంగస్థలి కళాకారులు బుధవారం ఘన నివాళులు అర్పించారు. వేటూరి జయంతి పురస్కరించుకుని రంగస్థలి కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి కేవీఎస్.రాజా, కళాకారులు గురుప్రసాద్, చెంగల్‌రాయులు, పీరంభాయ్ రహీం, శ్రీకాంత్, సుబ్రమణ్యం రెడ్డి, వాసు, రాఘవేంద్ర ఆచారి పాల్గొన్నారు.

ఏనుగుల సంరక్షణ అందరి బాధ్యత



కళాజాతలో అటవీశాఖ అధికారులు, కళాకారులు

పాకాల: జాతీయ సంపదైన ఏనుగుల సంరక్షణ అందరి బాధ్యతని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ భారతి అన్నారు. బుధవారం మండలంలోని పదిపుట్లబైలు, పేరసానిపల్లె, పెరుమాళ్లగుడిపల్లె, పుల్లావాండ్లపల్లెలో అటవీ అధికారులు కళాజాతతో ఏనుగులపై అవగాహన కల్పించారు. పంటల వద్దకు వద్ద ఏనుగులు వస్తే ప్రజలు అక్కడికి వెళ్లరాదని, వాటిపై రాళ్లు విసరడం, వాటిని తరిమేందుకు టపాసులు కాల్చి, ప్రాణాల మీదుకు తెచ్చుకోరాదని విజ్ఞప్తి చేశారు. ఏనుగులు ఉన్నట్టు గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోతే పరిహారం ఇస్తామన్నారు. కార్యాక్రమంలో సర్పంచ్ బుజ్జమ్మ, ఎఫ్‌బీఓ జమునారాణి, వీఎస్ఎస్ (వన సంరక్షణ సమితి) చెంగల్‌రాయులు, నరేష్ యాదవ్, గుణ, మల్లి, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

జగదీష్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఈఈఈ విభాగం పరిశోధక విద్యార్థి కమ్మరి జగదీష్‌కు డాక్టరేట్ ప్రకటించారు. ఈఈఈ విభాగంలో జగదీష్ 100వ పీహెచ్‌డీ పూర్తి చేసిన వ్యక్తి కావడం విశేషం. ఆయన ప్రొఫెసర్ సీహెచ్ చెంగయ్య పర్యవేక్షణలో 'మోడలింగ్ అండ్ ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ సోలార్ పవర్ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్' అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

మందుబాబులకు జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం సేవించి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ 10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 40 మందికి రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తీర్పు చెప్పారు.

ఘనంగా సిపాయి జన్మదినం



అన్నదానం చేస్తున్న డాక్టర్ శ్రీహరి, డాక్టర్ మౌనరెడ్డి

తిరుపతి తుడా: రష్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. హాజరైన ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ, ఎమ్మెల్సీ సిపాయి జన్మదినం సందర్భంగా వందల మందికి అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సిపాయి మౌన రెడ్డి, మేనేజర్ మహేష్, రోజా, నిర్మల, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల ఆహ్వానం

చంద్రగిరి: నియోజకవర్గంలోని యర్రావారిపాళ్యం మండలానికి కల్లుగీత కార్మికుల కోటాలో మద్యం దుకాణం కేటాయించారని, దీనికి తిరుపతి జిల్లాకు చెందిన ఈడిగ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలని చంద్రగిరి ఎక్సైజ్ సీఐ ఫణీంద్ర బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి కలిగిన వారు రూ.2 లక్షలు డీడీ రూపంలో చెల్లించి, దరఖాస్తుతో పాటు కుల, స్థానిక ధ్రువీకరణ పత్రాలను కూడా జతజేసి ఫిబ్రవరి 5వ తేది సాయంత్రం 5 గంటల లోపు తమ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఘనంగా సామంచి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి సతీష్ కుమార్

తిరుపతి గాంధీ రోడ్డు: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా న్యాయవాది సామంచి శ్రీనివాస్ బుధవారం తిరుపతిలో ప్రమాణ స్వీకారం చేశారు. తుడా కాంప్లెక్స్‌లోని కచ్చాపి ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సతీష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీజేపీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ మంచి ప్రాధాన్యత లభిస్తుందని అన్నారు. అంతకు ముందు నగరంలో బీజేపీ యువత, అభిమానులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ల్యాబ్ టెక్నీషియన్ సభ్యులకు సత్కారం



పదవులు పొందిన సభ్యులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తిరుపతి తుడా: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్, రేడియాలజీ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో ఇటీవలే రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో తిరుపతి మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యులకు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించారు. తిరుపతి జిల్లాకు సంబంధించి జాయింట్ సెక్రటరీలుగా సందీప్ రెడ్డి, వెంకటరత్నం, కార్యనిర్వాహక సభ్యులు అనెం నరేంద్ర, గోపిలను ఎన్నుకున్నారు. వారిని బుధవారం తిరుపతి ల్యాబ్ అసోసియేషన్ సత్కరించి అభినందించింది. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభు, సభ్యులు హరి, నితిన్, యజ్ఞ నారాయణ, హరీష్, సుమన్ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దొడ్డారెడ్డి సుబ్బరామరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: దొడ్డారెడ్డి రామకృష్ణారెడ్డి, దొడ్డారెడ్డి ప్రకాష్‌రెడ్డిల మాతృమూర్తి దొడ్డారెడ్డి నిర్మలమ్మ ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం దొడ్డారెడ్డి సుబ్బరామరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కపిలతీర్థం, రుయా ఆసుపత్రి వద్ద పేదలకు, నిరాశ్రయులకు అన్నదానం చేశారు. 'దొడ్డారెడ్డి' కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో శిక్షణ తరగతులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ప్రభుత్వ ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మసిస్టులు నైపుణ్యాల పెంపొందించేందుకు భారత ప్రభుత్వ లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'రిటైల్ ఫార్మసీ మేనేజ్‌మెంట్ అండ్ సేల్స్' అనే అంశంపై నాలుగు రోజులు శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.నిరంజన్‌బాబు హాజరై మాట్లాడారు. ప్రతి ఫార్మసిస్టు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకుని తమ వద్దకు వచ్చే రోగులకు నాణ్యమైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ విభాగాధిపతి ఎం.చంటినాయక్, జనరల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్వీ.గౌరీశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడికి శ్రద్ధాంజలి



రెడ్డెప్పరెడ్డి చిత్రపటానిని పుష్పాంజలి ఘటిస్తున్న చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీ కోడెకం భంవారిపల్లెకు చెందిన శతాధిక వృద్ధుడు రెడ్డెప్పరెడ్డి (104) కర్మక్రియలకు వైఎస్సార్ సీపీ నేత చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి బుధవారం హాజరయ్యారు. రెడ్డెప్పరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెడ్డెప్పరెడ్డి 104 ఏళ్లు జీవించడం వెనుక ఆయన పాటించిన ఆహారపు అలవాట్లు, మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

కబడ్డీ జట్లకు అభినందన



ప్రతిభ చాటిన ఉమ్మడి చిత్తూరు జిల్లా స్త్రీ, పురుషుల కబడ్డీ జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా అంకుపాలెంలో 71వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పురుషుల జట్టు ద్వితీయ స్థానం, మహిళల జట్టు తృతీయ స్థానం సాధించాయి. బుధవారం ఆ జట్లను తిరుపతిలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి గంగాధర్, కబడ్డీ కోచ్ రామచంద్ర, చైతన్య ఘనంగా సత్కరించారు.